క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన



రామాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, అధికారులు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని రామగిరిలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం వేణుగోపాలరావు, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు యాట జయప్రద, వేదాంతం శ్రీనివాసాచార్యులు, కక్కిరేణి లక్ష్మీనారాయణ, ఈట జయరామయ్య, చీర పంకజ్ యాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

మునుగోడు: డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుని సాధించేందుకు సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే పాదయాత్రని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. శనివారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 14న పాదయాత్రను ప్రారంభిస్తామన్నారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల అభివృద్ధికి గాను డిండి ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. అంజయ్యాచారి, బచ్చనగోని గాలయ్య, చాపల శ్రీను, టి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జన చైతన్య యాత్ర సభను జయప్రదంచేయాలి

నకిరేకల్: నకిరేకల్‌లో సోమవారం నిర్వహించనున్న జన చైతన్య బస్సు యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆయన సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 17న ప్రారంభమైన బస్సు యాత్ర 27న నకిరకల్‌కు చేరుకుంటుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకురాలు కందాల ప్రమీల, పట్టణ, మండల కార్యదర్శులు వంటెపాక వెంకటేశ్వర్లు, బొజ్జ చిన వెంకులు, రాచకొండ వెంకట్‌గౌడ్, నాయకులు మర్రి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్న కొండేటి మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు

కేతేపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై గడప గడపకూ తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అవినీతికి పాల్పడుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కేతేపల్లి మాజీ జెడ్పీటీసీ జటంగి లక్ష్మమ్మవెంకటనర్సయ్యయాదవ్, యూత్ కాంగ్రెస్ నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుండా జలంధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు నకిరేకంటి మంగమ్మ, మాజీ సర్పంచి ఎస్‌కే. లతీఫ్, జగన్నాథం, జటంగి మల్లయ్య, జటంగి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మారిన పేరు



నూతన వైద్యాధికారి పేరుతో బోర్డు

చండూరు: గతంలో చండూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేసిన శ్రీనివాస్ బదిలీపై వెళ్లి నెలలు గడుస్తున్నా సమాచార బోర్డుపై కొత్త వైద్యాధికారి ఎం. రాజు పేరును చేర్చకపోవడంతో ఈ నెల 14న 'సమాచార బోర్డు మార్చరూ' అనే శీర్షికన సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆస్పత్రి సిబ్బంది వెంటనే బోర్డుపై ప్రస్తుత వైద్యాధికారి ఎం. రాజు పేరును ఏర్పాటు చేశారు.

నేడు 'నవమి' ఉత్సవాలకు శ్రీకారం

- చందుపట్ల నుంచి బండపాలెం గుట్టపైకి చేరుకోనున్న ఉత్సవమూర్తులు
- రెండు గ్రామాలకు ఒక్కడే రాముడు
- 30న స్వామివారి కల్యాణోత్సవం



చందుపట్ల గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం



బండపాలెం గ్రామంలో గుట్టపై గల ఆలయం ఎదుట కోనేరు

నకిరేకల్: మండలంలోని చందుపట్ల గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో కొలువైన రాముడు ఏడాదంతా నిత్యపూజలు జరుపుకొని, పక్కనే ఐదు కిలోమీటర్ల దూరంలో కేతేపల్లి మండలంలోని బండపాలెం గ్రామంలో గల గుట్టపై శ్రీరామనవమి సందర్భంగా కల్యాణోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం నుంచి ప్రారంభకానున్న శ్రీరామనవమి ఉత్సవాలు ఏప్రిల్ 3వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఉత్సవమూర్తులు ఆదివారం చందుపట్ల గ్రామం నుంచి బండపాలెం గుట్ట మీదకు చేరుకోవడంతో శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభకానున్నాయి. తిరిగి ఏప్రిల్ 3వ తేదీన ఉత్సవమూర్తులను చందుపట్ల దేవాలయానికి చేర్చడంతో ఉత్సవాలు ముగుస్తాయి. సంవత్సరం అంతా చందుపట్లలో పూజలు అందుకున్న శ్రీరాముడిని శ్రీరామనవమి సందర్భంగా దాదాపు 100 మంది గంగపుత్రులు పల్లకీలో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బండపాలెం గుట్టపైకి ఊరేగింపుగా తీసుకెళ్లి కల్యాణం జరిపించి తిరిగి చందుపట్ల ఆలయానికి తీసుకురావడం ఆనవాయితీగా వస్తోంది.

కోనేటి విశిష్టత..

బండపాలం గ్రామంలో గుట్టపై గల కోనేరు ఇప్పటివరకు ఎండిపోకుండా ఉండడం, శ్రీరామనవమి సమయంలో ఎవరి ప్రమేయం లేకుండా ఆ కోనేరులో నీటిమట్టం పెరగడం ఈ కోనేటి విశిష్టత. ఈ కోనేటిలోని నీరు ఔషధ గుణాలు కలిగి ఉంటాయని, ఈ కోనేరు శ్రీరాముడి పాదముద్రగా ప్రజలు నమ్ముతారు.

ఉత్సవాలలోని కార్యక్రమాలు..

26న చందుపట్ల నుంచి ఉత్సవమూర్తులను బండపాలెం గ్రామంలోని గుట్ట పైకి ఊరేగింపుగా తీసుకెళ్లడంతో ప్రారంభమయ్యే ఈ శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా 27న బండపాలెం గుట్టపై పదోత్సవం, 28న విశ్వక్సేన పూజ, స్వస్తి పుణ్యావాచనం, అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠ, 29న హోమం, బలిహరణం, గరుడ ముద్ద ధ్వజారోహణం, బేరి పూజలు నిర్వహిస్తారు. 30న సీతారాముల కల్యాణోత్సవం, ఏప్రిల్ 1న చక్రస్నానం, 2న పుష్పయాగం, ఏకాంత సేవ, 3న ఉత్సవమూర్తులను చందుపట్లకు తరలించడంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

కలిసికట్టుగా నిర్వహిస్తాం



రెండు గ్రామాలకు ఒకే రాముడు ఉండి ప్రతి ఏటా రెండు గ్రామాల ప్రజలంతా కలిసి కల్యాణోత్సవాలు జరుపుకుంటాం. కల్యాణానికి చందుపట్ల గ్రామం నుంచి బండెపాలెం గ్రామానికి తలంబ్రాలు తీసుకెళ్లటం ఆనవాయితీగా వస్తుంది.

– మేడవరపు కిషన్‌రావు, ఆలయ చైర్మన్, చందుపట్ల

ఏర్పాట్లు పూర్తిచేశాం



శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాటు పూర్తిచేశాం. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ రెండు ఆలయాలను ప్రభుత్వం గుర్తించి అభివృద్ధి చేయాలి. గత 31ఏళ్లుగా రెండు గ్రామాల ప్రజలు కలిసి ఆలయాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం.

– మారం మీనారెడ్డి, ఆలయ చైర్మన్, బండపాలెం

ఇచ్చిన హామీలను వందశాతం పూర్తిచేస్తాం



మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ: మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఇచ్చిన ప్రతి హామీని వందశాతం పూర్తిచేస్తామని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలోని భారత్ గార్డెన్‌లో మర్రిగూడ, నాంపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నియోజకవర్గవ్యాప్తంగా 3వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందిస్తామన్నారు. ఏప్రిల్ 1న మర్రిగూడ, 2న నాంపల్లి మండలాల్లో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, వెలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, మునగాల నారాయణరావు, వేనేపల్లి వెంకటేశ్వర్‌రావు, ఎడుదొడ్ల రవీందర్‌రెడ్డి, బచ్చు రామకృష్ణ, అనంత రాజుగౌడ్, పందుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'హద్దులు చూపించండి'

చండూరు(గట్టుప్పల): గట్టుప్పల మండలంలోని తేరట్‌పల్లి గ్రామంలో 377, 378 సర్వే నంబర్లలో గ్రామంలోని పేదలకు 1992లో ఇళ్ల స్థలాలు ఇచ్చి హద్దులు చూపించకపోవడంతో కొంతమంది ఆ స్థలాలను ఆక్రమించుకుంటున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. తమ ఇళ్ల స్థలాలకు హద్దులు చూపించాలని పట్టాలు అందుకున్న పేదలు గట్టుప్పల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నాకు దిగారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ.. ప్రభుత్వ భూమిలో పేదలకు పట్టాలిచ్చిన విషయం కలెక్టర్‌కు తెలిపామన్నారు. ఆ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని, లబ్ధిదారులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన పెంబళ్ల వేణుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.34వేలు, బోయగుబ్బ గ్రామానికి చెందిన లలితమ్మకు రూ.56వేలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కులను శనివారం ఉరుమడ్ల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.

ఆర్థికసాయం అందజేత..

ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఉయ్యాల లింగస్వామి, ఈర్ల మల్లయ్య, పాకాల రవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి సహకారంతో మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి మృతుల కుటుంబాలకు శనివారం రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పే స్కేల్ వర్తింపజేయాలని వినతి

నల్లగొండ టూటౌన్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పే స్కేల్ వర్తింపజేయాలని ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గుత్తాను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, సింగం రమేష్, సంజీవ్‌కుమార్, రఫీ, సయ్యద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' కృషి అభినందనీయం



సాక్షి పత్రికను ప్రదర్శిస్తున్న యోగా శిక్షణ పొందుతున్న మహిళలు, ట్రైనర్.. చిత్రంలో సాక్షి సర్క్యులేషన్ ఇన్‌చార్జి శ్రీనివాస్

రామగిరి(నల్లగొండ): మహిళలకు ఉపయోగపడే ఆరోగ్య విషయాలపై కథనాలు ప్రచురిస్తూ వారిని ఆరోగ్యం పట్ల చైతన్యపరుస్తున్న సాక్షి కృషి అభినందనీయమని పలువురు మహిళలు అన్నారు. శనివారం 'సాక్షి ఫ్యామిలీ'లో ప్రచురితమైన స్టిక్ యోగా కథనాన్ని ప్రదర్శించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నల్లగొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సతీమణి రమాదేవి యోగా శిక్షకురాలు వరికుప్పల సంధ్యను సన్మానించారు. అమ్మ ఆరోగ్యం అనే అంశంతో యోగా ద్వారా మహిళలలో ఉండే రుగ్మతలను, మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు సంధ్య చేస్తున్న కృషిని ఆమె కొనియాడారు.

నిరుద్యోగులు అనుకున్న లక్ష్యాలను సాధించాలి



మోడల్ టెస్ట్ జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న దుబ్బాక నర్సింహారెడ్డి

నల్లగొండ: నిరుద్యోగులు అనుకున్న లక్ష్యాలను సాధించాలని, అందుకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోలీస్(హెచ్ఐపీ) సౌజన్యంతో దుబ్బాక నర్సింహారెడ్డి సహకారంతో ఎస్ఐ, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు పట్టణంలోని బీట్ మార్కెట్ యార్డులో మోడల్ టెస్ట్ నిర్వహించారు. ఉద్యోగార్థులకు మోటివేటర్ రాఘవేందర్‌రావు ఆధ్వర్యంలో మోటివేషన్ తరగతులు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పున్న కైలాస్, అల్లి సుభాష్, వైస్ ఎంపీపీ జిల్లపల్లి పరమేష్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరికాదు

రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడం సరికాదని దుబ్బాక నర్సింహారెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్థిక దోపిడీలు చేసే వారిని వదిలి రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

బీజేపీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు చేస్తోంది



మాట్లాడుతున్న దూదిమెట్ల బాలరాజుయాదవ్

శాలిగౌరారం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడుతుందని రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ అన్నారు. మండంలోని శాలిలింగోటంలో శనివారం రాత్రి ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ ఎదుగుదలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. సీఎం కేసీఆర్ మనోధైర్యాన్ని దెబ్బతీసేందుకు ఎమ్మెల్సీ కవితను బీజేపీ టార్గెట్ చేసి అక్రమ కేసులను మోపేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా అంతిమంగా న్యాయమే గెలుస్తుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో గణేశ్, వీరయ్య, మహేశ్, ఉదయ్, సంపత్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకులు దీక్ష చేయడం సిగ్గుచేటు

నల్లగొండ టూటౌన్: ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మోసం చేస్తే చడీచప్పుడు చేయని రాష్ట్ర బీజేపీ నాయకులు ఇప్పుడు దీక్ష చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జునముదిరాజ్ అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో బీజేపీ కార్యకర్త ఉంటే మంత్రి కేటీఆర్‌పై అసత్య ఆరోపనలు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షా 32వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని, కేంద్రం ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు పెరిక దివాకర్, డి. వెంకట్, కారింగ్ శ్రీకాంత్‌గౌడ్, శివ, గణేష్, ప్రశాంత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు



నల్లగొండ: మర్రిగూడ బైపాస్‌పై ధర్నా చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు



నకిరేకల్: ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దైద రవీందర్ తదితరులు



నార్కట్‌పల్లిలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ: రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ పట్టణంలోని మర్రిగూడ బైపాస్‌లో నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్‌ను దిగ్బంధించారు. ఈ సందర్భంగా రోడ్డుపై అడ్డంగా కూర్చొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గోని రాజారమేష్ యాదవ్, అజార్, గాలి నాగరాజుకుమార్, సంతోష్, జగదీష్‌రెడ్డి, బొంగరాల ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లిలో రాస్తారోకో నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఊషయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పాశం శ్రీనివాస్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య, కొమ్మనబోయిన మల్లేష్, నూకల శంకర్, వడ్డే భూపాల్‌రెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్: నకిరేకల్‌లో టీపీసీసీ నేత దైద రవీందర్ ఆధ్వర్యంలో శనివారం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గాజుల సుకన్య, దైద స్వప్న, యూత్ అధ్యక్షుడు ముద్దం విజయ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పన్నాల రాఘవరెడ్డి, యాసా కరుణాకర్‌రెడ్డి, రాచకొండ లింగయ్యగౌడ్, లింగాల వెంకన్న, గుండా జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

చిట్యాల: చిట్యాలలో మండల కాంగ్రెస్ నాయకుడు కందాటి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పెద్దకాపర్తి, చిన్నకాపర్తి గ్రామ శాఖ అధ్యక్షులు నీలకంఠం లింగస్వామి, బోయపల్లి వెంకన్నగౌడ్, నాయకులు గంగారపు గణేష్, ముప్ప ముత్తిరెడ్డి, బోడ శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో..

కేతేపల్లి: కేతేపల్లిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మకు కాంగ్రెస్ నాయకులు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, డీసీసీ మాజీ అధ్యక్షుడు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, మండల మహిళా అధ్యక్షురాలు నకిరేకంటి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల అభిరుచులను గుర్తించి ప్రోత్సహించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న కమాండెంట్ సాంబయ్య

రామగిరి(నల్లగొండ): తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచులను గుర్తించి ప్రోత్సహించాలని అన్నెపర్తి 12వ బెటాలియన్ కమాండెంట్ ఎన్వీ సాంబయ్య అన్నారు. శనివారం పట్టణంలోని బండారు గార్డెన్‌లో నిర్వహించిన విపస్య ది స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలపై మానసికంగా ఒత్తిడి చేయకూడదని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బండారు ప్రసాద్, ప్రిన్సిపాల్ మాదాసు భరత్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్: పట్టణంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారి సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అత్యవసర సమావేశం నిర్వహించి మాట్లాడారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, రంజాన్ పండుగలు ఉన్నందున ఏర్పాట్లు చేయాలని, రోడ్డు మధ్యలో ప్యాచ్ వర్క్ పనులను త్వరగా పూర్తి చేయాలని, ఈద్గాలు, వైకుంఠధామాల వద్ద చెట్ల కొమ్మలను తొలగించాలని, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. పాతబస్తీ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, డీఈలు వెంకన్న, నరసింహారెడ్డి, అశోక్, ఏఈ దిలీప్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తుజా అలీ, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియంతలా సీఎం కేసీఆర్

నల్లగొండ టౌన్: ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలపై ఉక్కుపాదం మోపుతూ సీఎం కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని మాలమహానాడు జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు ఆరోపించారు. శనివారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన మాలమహానాడు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు రోజుల పాటు జాతీయ మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి దయాకర్‌ను గృహనిర్బంధం చేయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో నాయకులు బోగరి విజయ్‌కుమార్, మేడిపల్లి లక్ష్మణ్, లింగస్వామి, మురళి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

నల్లగొండ టూటౌన్: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని బీజేపీ నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్ అన్నారు. శనివారం బీజేపీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు మొరిశెట్టి నాగేశ్వర్‌రావు జన్మదినం సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, రావిరాల వెంకటేశ్వర్లు, కంకణాల నాగిరెడ్డి, రావెళ్ల కాశమ్మ, చర్లపల్లి గణేష్, దాసరి సాయి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేయొద్దు

చండూరు: మున్సిపల్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేయొద్దని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. శనివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని పలు వాణిజ్య సముదాయాలు, దుకాణాలను సందర్శించి మాట్లాడారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని ఎన్జీ కళాశాలలో తెలుగు శాఖ, కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం, మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సంయుక్తంగా విద్యార్థులకు నెల పాటు తెలుగు టైపింగ్, డీటీపీ, ఎంఎస్ ఆఫీస్ శిక్షణ అందించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఘనశ్యామ్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్. దీపిక, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసన్నకుమార్, నెహ్రూ యువ కేంద్రం డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, దుర్గాప్రసాద్, తండు క్రిష్ణయ్య, లవీందర్‌రెడ్డి, డాక్టర్ వీవీ సుబ్బారావు, ఎస్పీ వెంకటరమణ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సెర్ప్ ఉద్యోగులు

రామగిరి(నల్లగొండ): సెర్ప్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పే స్కేల్ ఇచ్చిన సందర్భంగా నల్లగొండ జిల్లా సెర్ప్ జేఏసీ శనివారం జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి నర్సయ్య, మోహన్‌రెడ్డి, ఏపీఎంలు బాషపాక చంద్రశేఖర్, నరహరి, యాదయ్య, మైసేశ్వర్‌రావు, వినోద, ప్రభాకర్, హరి, పుల్లయ్య, సైదులు, శ్రీదేవి, పద్మ, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి సర్వే

చిట్యాల: పట్టణంలోని సర్వే నంబర్ 651లో గల ప్రభుత్వ భూమిని శనివారం జిల్లా ల్యాండ్ సర్వేయర్ అండ్ రికార్డు ఏడీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సర్వే చేశారు. ఈ సర్వే నంబర్‌లోని భూమి ఆక్రమణకు గురవుతుందని ఫిర్యాదు అందడంతో సర్వే చేసినట్లు ఏడీ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ మంచ్యానాయక్, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కనగల్: రాష్ట్రంలో జరుగుతున్న జనచైతన్య యాత్రలు ఈ దేశ ప్రజల రక్షణ కొరకే అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జనచైతన్య యాత్ర పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో మాట్లాడే హక్కు లేనట్లుగా ఉందన్నారు. ఈ నెల 27న నల్లగొండలోని భాస్కర్ టాకీస్ వద్ద ఉదయం 9గంటలకు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందుల సైదులు, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠాపనోత్సవాలు

కనగల్: మండలంలోని బోయినపల్లి గ్రామంలో గల శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం గోపూజ, మామిడి తోరణాలు, విఘేశ్వర పూజ, అంజనేయస్వామి పూజ, అఖండ దీపారాధన నిర్వహించారు. సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉంటుందని సర్పంచ్ పగిళ్ల యాదయ్య, కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పరీక్ష ప్యాడ్‌లు అందజేత

కనగల్: మండల పరిధిలోని రేగట్టె గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం లిఖిత ఫౌండేషన్ చైర్మన్ చింతకింది స్వామికుమార్‌గౌడ్ పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కడారి కృష్ణయ్య, హెచ్‌ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక చేయూత

నల్లగొండ క్రైం: మృతిచెందిన పోలీసు కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించి అండగా ఉంటామని జిల్లా ఎస్పీ అపూర్వరావు అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అనారోగ్యంతో మృతిచెందిన ఏఎస్సై జి. నారాయణరావు సతీమణి రమాదేవికి రూ.2లక్షల చెక్కును ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజ్, సోమయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

753 మంది గైర్హాజరు

నల్లగొండ: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు మొత్తం 15,951 మంది హాజరుకావాల్సి ఉండగా 15,198 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. 753 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.